

హెర్బల్ అండ్ మెడిసినల్ గార్డెన్

పామ్ మతున్ గార్డెన్



ఇక్సోర గార్డెన్



కేబీఆర్ వాక్ వేలో థీమ్ పార్కులు..!

మెరుగైన నిర్వహణ చేపట్టాలని అదనపు కమిషనర్ ఆదేశం

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కేబీఆర్ పార్కు వాక్ వేలో థీమ్ పార్కులు అందుబాటులోకి వచ్చాయి. హెర్బల్, మెడిసినల్, ఈక్సోరా, ఫైకస్.. తదితర థీమ్‌లతో పది పార్కులను జీహెచ్‌ఎంసీ ఇటీవల అభివృద్ధి చేసింది. వర్షాల నేపథ్యంలో ఆ పార్కుల్లో నిర్వహణ ఎలా ఉంది..? వరద నీరు వృథాగా పోతుందా..? అన్నది అర్బన్ బయోడైవర్సిటీ విభాగం అదనపు కమిషనర్ డాక్టర్ కె.సునందారాణి గురువారం పరిశీలించారు. కేబీఆర్ పార్కు లోపల, చుట్టూ ఉన్న వాక్ వేలో వాకింగ్, జాగింగ్ కోసం ఉదయం, సాయంత్రం పౌరులు వస్తుంటారు. వీరికి ఉపయుక్తంగా ఉంటుందన్న ఉద్దేశ్యంతో వాక్ వేలో అందుబాటులో ఉన్న స్థలంలో అక్కడక్కడ మినీ థీమ్ పార్కులను బల్దియా అభివృద్ధి చేసింది. ఆ పార్కుల్లో నిర్వహణ పనులు మెరగుపర్చాలని, ట్రిమ్మింగ్, స్వీపింగ్, గ్రీన్ వెస్ట్ తొలగింపు, ఖాళీ స్థలాల్లో ప్లాంటేషన్ వంటివి వెంటనే చేపట్టాలని సునందారాణి అధికారులను ఆదేశించారు. డ్రిప్ ఇరిగేషన్ ద్వారా థీమ్ పార్కుల్లో మొక్కలకు నీటిని అందించే విషయంపై చర్చించారు. వాక్ వేలో మెట్లు, కెర్బ్ వాల్ పెయింటింగ్, చుట్టూ ఉన్న రాతి కుర్చీల మరమ్మతు, బసవతారకం కేన్సర్ ఆస్పత్రి వద్ద వాక్ వే వైపు చెత్త వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పాత్ వే పైకి వస్తోన్న వరద, మురుగునీటిని మళ్లించాలని, పాడైన గ్రిల్స్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయా పనులు పూర్తయ్యేలా సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకోవాలని అర్బన్ బయోడైవర్సిటీ డిప్యూటీ డైరెక్టర్‌ను ఆమె ఆదేశించారు.



అధికారులతో కలిసి పార్కులో పర్యటిస్తున్న సునందరాణి



బటర్‌ఫ్లై గార్డెన్



ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా(ఈఎస్‌సీఐ) గచ్చిబౌలి ప్రాంగణంలో సెంటినరీ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానించారు. ఈఎస్‌సీఐ చైర్మన్ డాక్టర్ జి.రామేశ్వర్‌రావు గురువారం సీఎం కార్యాలయంలో రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు
● హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి)



ప్రదర్శనను తిలకిస్తున్న సందర్శకులు

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో

బంజారాహిల్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ రోడ్డు నంబర్.12 కళింగ కల్చరల్ సెంటర్‌లో నేషనల్ సిల్క్ ఎక్స్‌పో పేరిట ఏర్పాటైన ప్రదర్శన మహిళలను ఆకట్టుకుంటోంది. మంగళగిరి, ఉప్పాడ, వెంకటగిరి, భాగల్‌పూర్, కాంతా వర్క్, హ్యాండ్ బ్లాక్, ప్రింటెడ్ శారీస్, లినెన్ శారీస్, కలంకారి, బెంగాల్ కాటన్, లేడీస్ ఫ్యాన్సీ టాప్స్, డిజైనర్ జాకెట్‌లు, లక్నోచికాన్, బనారస్ శారీస్, ఖాదీ మెటీరియల్, వన్‌గ్రామ్ గోల్డ్ జువెలరీ వంటివి మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 14 నగరాలకు చెందిన చేనేతకారులు తమ ఉత్పత్తులను 70కి పైగా స్టాల్స్‌లో పెట్టి వినియోగదారులకు అందుబాటులో ఉంచారు. ప్రదర్శన ప్రవేశ ఉచితం అని నిర్వాహకులు తెలిపారు. ప్రదర్శన మరికొన్ని రోజులు మాత్రమే ఉంటుందని వారు తెలిపారు.

నగరంలో 2,884 ఇంకుడు గుంతల నిర్మాణం

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వాటర్ ట్యాంకర్ల డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఇంకుడు గుంతల నిర్మాణంపై అవగాహన కల్పించగా ఇప్పటి వరకు 2,884 కుటుంబాలు ముందుకొచ్చాయని, ఇళ్లలో ఇంకుడు గుంతలను నిర్మించుకున్నాయని వాటర్‌బోర్డు అధికారులు వెల్లడించారు. 296 కుటుంబాలు వినియోగంలో లేనివాటికి మరమ్మతులు చేసుకున్నాయని తెలిపారు. ఇంకుడు గుంతల సర్వేపై ప్రధాన కార్యాలయంలో గురువారం రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్‌కుమార్ సమీక్షించారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇప్పటికే 4,736 కుటుంబాల్లో ఇంకుడు గుంతల నిర్మాణంపై సర్వే చేశారని తెలిపారు. వీరంతా ఆయా కుటుంబాలకు ఇంకుడు గుంతల నిర్మాణం ఆవశ్యకతపై అవగాహన కల్పించారని పేర్కొన్నారు. మిగిలిన 1,852 కుటుంబాలు నిర్మించుకోవాల్సి ఉందని తెలిపారు. సమావేశంలో ఇంకుడు గుంతల మాజీ ప్రత్యేకాధికారి జాల సత్యనారాయణ, సింగిల్ విండో సెల్ జీఎం దామోదర్‌రెడ్డి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో వైద్యులు, పిల్లలతో ఎండీ డాక్టర్ గురువారెడ్డి

వంకర కాళ్లతో పుట్టిన పిల్లలకు ఆధునిక చికిత్స

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వంకర కాళ్లతో పుట్టిన పిల్లలకు ఆధునిక వైద్య చికిత్సలు, సాంకేతికతో సరిచేసి వారు సాధారణ జీవనం గడిపేటట్టు చేయవచ్చునని పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ వివరించారు. వరల్డ్ క్లబ్‌ఫుట్‌డే సందర్భంగా బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన చిన్నారులకు చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ చైర్మన్, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏవీ గురవారెడ్డి చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ఫుట్ సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు డాక్టర్ విద్యాసాగర్ పరీక్షలు చేసి చికిత్స అందజేశారు. వంకర కాళ్లతో సరిగ్గా నడవలేకపోవడం, కూర్చోలేక ఇబ్బంది పడుతుంటారని, దీనిని వైద్య పరిబాషలో క్లబ్‌ఫుట్ సమస్యగా పరిగణిస్తారని డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. ఇది కొంతమంది పిల్లల్లో వంశపారపర్యంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వారికి ఆధునిక శాస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, తద్వారా సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సలతోపాటు సాంకేతికతకతో సరిచేయడం వల్ల పిల్లలు సాధారణ జీవితం గడపడమే కాకుండా, క్రీడల్లోనూ పాల్గొనవచ్చు అన్నారు. క్లబ్ ఫుట్ సమస్యకు చికిత్స తీసుకుంటున్న చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతీ ఇంటికి స్వచ్ఛటిప్పర్ వెళ్లాల్సిందే

ఖైరతాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రతీ వీధికి, ఇంటికి స్వచ్ఛ ఆటో టిప్పర్ వెళ్లాల్సిందేనని సర్కిల్ ఉప కమిషనర్ ప్రశాంతి ఆదేశించారు. గురువారం ఖైరతాబాద్ జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో ఆమె సర్కిల్ వైద్యాధికారి డాక్టర్ రవితో పాటు అన్ని ప్రాంతాల ఎస్‌ఎఫ్‌ఏలతో ప్రత్యేకంగా సమావేశమై పలు సూచనలు చేశారు. 10 రోజుల్లో సర్కిల్‌లోని అన్ని చెత్త వేసే పాయింట్లను తొలగించాల్సిందేనని ఆమె ఆదేశించారు.

ఎస్సీ ఉపకులాల సమస్యలు పరిష్కరించాలి

పంజాగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): దళితుల్లో అత్యంత వెనకబడ్డ ఉపకులాల సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ ఉపకులాల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షుడు భైరి వెంకటేశం మోచి విజ్ఞప్తి చేశారు. గురువారం నగరంలోని జాతీయ ఎస్సీ కమిషన్ కార్యాలయంలో జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్‌ను కలిసి సమస్యలను వివరించారు. కుల ధ్రువీకరణ పత్రాలను ఆర్డీవో ద్వారా కాకుండా దళితులందరికీ తహసీల్దార్ ద్వారానే ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు మహేష్, రవీందర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల పెంపునకు మిలిటెంట్ పోరాటాలు

పంజాగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపు, వాటి హక్కుల సాధన కోసం మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలంటూ పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కామారెడ్డి డిక్లరేషన్-సమగ్ర కులగణన' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ ఆర్‌ఎస్.ప్రవీణ్ కుమార్, గిరిజన రిజర్వేషన్ సాధన సమితి చైర్మన్ సంజీవ్ నాయక్, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల హక్కుల సాధన కోసం ఈ నెల 15న ఇందిరాపార్కు వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం బీసీ సంఘాలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని ఆర్.కృష్ణయ్య అన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తేవాలని ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. సమావేశంలో రాజారాం యాదవ్, వివిధ బీసీ సంఘాల నాయకులు కాటం నర్సింహ యాదవ్, పోచబోయిన శ్రీహరి యాదవ్, సాయిని నరేందర్, బత్తుల సిద్దేశ్వర్, రమేష్ యాదవ్, ఆలకుంట హరి, నీల వెంకటేష్, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన పట్టు వస్త్రాలకు కేరాఫ్ తెలంగాణ

బంజారాహిల్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ నాణ్యమైన పట్టు వస్త్రాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని సోషలైట్ డాక్టర్ సుధాజైన్ అన్నారు. జూబ్లీహిల్స్‌లో గురువారం చేనేత ఉత్పత్తులపై అవగాహన కలిగించేలా కోహినూర్ పేరిట రూపొందించిన చేనేత డిజైన్‌లతో కూడిన ఆల్బమ్‌ను ఆమె ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ చేనేత ఉత్పత్తులను దేశ, విదేశాలకు పంపి చేనేత కళాకారుల ప్రతిభను చాటిచెప్పడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు చెప్పారు. నంది అవార్డు గ్రహీత, టెలివిజన్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ అధ్యక్షుడు మహ్మద్ షరీఫ్ మాట్లాడుతూ వారంలో ఒక రోజు తప్పనిసరిగా చేనేత వస్త్రాలు ధరించి, చేనేతకు చేయూతనివ్వాలన్నారు. కార్యక్రమంలో నిర్మాత, దర్శకుడు రమేష్‌రాజా, పాండురంగ హ్యాండ్లూమ్స్ నిర్వాహకుడు చిట్టిమల్ల పాండు తదితరులు పాల్గొన్నారు.

రహదారులు జలమయం

● భారీ వర్షానికి విరిగిపడ్డ చెట్లు
● రాకపోకలకు ఆటంకాలు
● విద్యుత్ సరఫరాకు అంతరాయం



బంజారాహిల్స్‌లో ట్రాన్స్‌ఫార్మర్‌పై కూలిన చెట్టు

బంజారాహిల్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రధాన రహదారులపై వరదనీరు నిలవడంతో ట్రాఫిక్‌జామ్ అయింది. గురువారం మధ్యాహ్నం నుంచి అమీర్‌పేట, బేగంపేట, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, యూసుఫ్‌గూడ, శ్రీనగర్‌కాలనీ ప్రాంతాల్లో పలు దఫాలుగా వర్షం కురిసింది. దీంతో ప్రధాన రోడ్లన్నీ జలమయమయ్యాయి. జూబ్లీహిల్స్ నుంచి వరద నీరు కృష్ణానగర్‌లో చేరడంతో వాహనాల రాకపోలకు ఆటంకాలు ఏర్పడ్డాయి. సంజీవరెడ్డినగర్ ప్రధాన రహదారిలో ఇదే పరిస్థితి నెలకొనడంతో ట్రాఫిక్ జామ్ అయింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్.3 అల్మండ్ హౌస్ వద్ద చెట్టు కొమ్మలు విరిగి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. జీహెచ్‌ఎంసీ సిబ్బంది చెట్టుకొమ్మలను తొలగించగా, ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.



ఇందిరానగర్ ప్రధాన దారిలో వరద నీరు

మధురానగర్‌లో విరిగిపడ్డ చెట్టుకొమ్మలు

● జి-బ్లాక్‌లో విద్యుత్ తీగ తెగి నిలిచిన సరఫరా ● తప్పిన ప్రమాదం.. ఇబ్బందులు పడ్డ స్థానికులు

వెంగళరావునగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఈదురుగాలులతో కూడిన భారీ వర్షానికి బుధవారం రాత్రి మధురానగర్‌కాలనీ బి, జి-బ్లాక్‌లలో చెట్టు కొమ్మలు విరిగిపడ్డాయి. దీంతో 11కేవీ విద్యుత్ తీగ తెగడంతో కొన్ని ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచింది. రాత్రి కావడంతో ప్రమాదం తప్పింది. స్థానికులు, కాలనీ సంక్షేమ సమితి ప్రతినిధులు విద్యుత్, జీహెచ్‌ఎంసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఆయా విభాగాల సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు సిబ్బంది చెట్టుకొమ్మలను పూర్తిగా తొలగించారు. విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరించారు. ఇక్కడ ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని తొలగించి, కొత్తది ఏర్పాటు చేయాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మధురానగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు కోడె సాంబశివ రావు, ప్రధాన కార్యదర్శి మన్నె కళ్యాణ్ చక్రవర్తి దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను తొలగించాలని, వీధి దీపాలకు మరమ్మతులు చేయాలని కోరారు.



తెగిన విద్యుత్ తీగను పరిశీలిస్తున్న సిబ్బంది



విరిగి రహదారికి అడ్డంగా పడ్డ భారీ చెట్టుకొమ్మ

ఈ-పెట్టీ కేసుల్లో జరిమానా కోర్టుకు చెల్లించాలి

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఈ-పెట్టీ కేసులకు సంబంధించి కోర్టు విధించిన జరిమానాను సంబంధిత కోర్టు అధికారులకు చెల్లించాలని కోర్టు కానిస్టేబుళ్లకు కాదని వెస్ట్‌జోన్ డీసీపీ విజయ్ కుమార్ స్పష్టం చేశారు. జరిమానా చెల్లించిన రసీదును తీసుకోవాలని సూచించారు. కోర్టు కానిస్టేబుళ్లు డబ్బులు వసూలు చేసినా, జరిమానా కంటే ఎక్కువ డబ్బులు అడిగినా దానికి సంబంధించిన రసీదును తీసుకొని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. బంజారాహిల్స్, మాసబ్‌ట్యాంక్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, పంజాగుట్ట, మధురానగర్, ఎస్‌ఆర్‌నగర్, బోరబండ పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో ఈ-పెట్టీ కేసులకు సంబంధించి ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే ఏసీపీలకుగానీ, తనకు (8712660404)గానీ ఫిర్యాదు చేయాలని సూచించారు.

ఇరవై రూపాయల కోసం కత్తితో దాడి

బంజారాహిల్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రూ.20 కోసం నలుగురు యువకులు ఓ యువకుడిని కత్తితో బెదిరించారు. డబ్బు లేదు అన్నందుకు దాడి చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఫిలింనగర్ సైదప్పబస్తీకి చెందిన చంద్రానాయక్ జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ క్లబ్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 5న అర్ధరాత్రి విధులు ముగించుకుని గౌతంనగర్ కమ్యూనిటీహాల్ వద్ద నుంచి నడుచుకుంటూ ఇంటికి వెళ్తున్నాడు. అదే సమయంలో దుర్గాభవానీనగర్ బస్తీకి చెందిన సత్యానంద్, గణేశ్, స్వామి, శివ అడ్డగించారు. రూ.20 ఇవ్వాలని డిమాండ్ చేశారు. తన వద్ద లేవని చంద్రనాయక్ చెప్పడంతో ఒకరు కత్తి తీసి బెదిరించారు. మిగతా వారు దాడి చేసి డబ్బులు దోచుకెళ్లారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు సత్యానంద్, గణేశ్, స్వామి, శివలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ వివాహం చేసుకుని వదిలేసిందని ఫిర్యాదు

యూసుఫ్‌గూడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకుని కొన్ని నెలలకే వదిలేసి వెళ్లిపోయిందని ఓ వ్యక్తి మధురానగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. రెహ్మత్‌నగర్ వీడియోగల్లీలో నివాసం ఉండే మురళీకృష్ణ ఫోటోగ్రాఫర్. 2024 జనవరిలో గుడివాడ వాణిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. బుధవారం ఉదయం 6 గంటలకు ఇంటి ఎదురుగా ఉన్న తన సోదరి ఇంటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో మురళీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అర్ధరాత్రి న్యూసెన్స్ చేస్తున్న వ్యక్తులు అరెస్ట్

యూసుఫ్‌గూడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి రోడ్డుపై సౌండ్‌బాక్స్ పెట్టి న్యూసెన్స్ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను మధురానగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. యూసుఫ్‌గూడ కృష్ణకాంత్ పార్కు వద్ద రోడ్డుపై జేబీసౌండ్ బాక్స్‌లు పెట్టి న్యూ సెన్స్ చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. బుధవారం రాత్రి పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు వెళ్లగా చన్ని సోమన్న, రామాంజనేయులు న్యూసెన్స్ చేస్తూ కనిపించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పార్కు చేసిన బైక్ మాయం

యూసుఫ్‌గూడ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పార్కు చేసిన ద్విచక్రవాహనం చోరీ అయింది. ఈ సంఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మధురానగర్‌లో నివాసం ఉండే పి.సిద్దార్థ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఈ నెల 2వ తేదీన తన ద్విచక్రవాహనాన్ని వెంగళరావునగర్ అయ్యప్పగ్రౌండ్ వద్ద పార్కు చేశాడు. తిరిగి 3వ తేదీ ఉదయం 6 గంటలకు వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఆఫీసుకు వెళ్లొస్తానని వ్యక్తి అదృశ్యం

ఖైరతాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఆఫీసుకు వెళ్లి వస్తానని చెప్పిన వ్యక్తి కనిపించకుండా పోయాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ నెహ్రూనగర్‌కు చెందిన కుటేమాస్ బలరాం(44) సోమాజిగుడలో ప్రైవేట్ ఉద్యోగం చేస్తుంటాడు. గత నెల 16న ఆఫీసుకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆచూకీ తెలిసిన వారు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లోగాని, 8712661531, 9912820552లో సంప్రదించాలని ఏఎస్ఐ సురేందర్ తెలిపారు.



బలరాం

ఉప ఎన్నికలు ఎప్పుడో..?

● గ్రేటర్‌లో నాలుగు డివిజన్లు ఖాళీ
● ఇద్దరు కార్పొరేటర్ల అకాల మరణం
● ఎమ్మెల్యేలుగా ఎన్నికైన మరో ఇద్దరు

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో నాలుగు డివిజన్లు ఖాళీ అయ్యాయి. రెండు స్థానాల్లో కార్పొరేటర్లు మరణించగా.. ఓ కార్పొరేటర్ ఎమ్మెల్సీగా, మరో కార్పొరేటర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. గుడిమల్కాపూర్ నుంచి బీజేపీ తరఫున కార్పొరేటర్‌గా ఎన్నికైన దేవర కరుణాకర్ 2023 జనవరిలో అనారోగ్యంతో మరణించారు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెహిదీపట్నం కార్పొరేటర్ మహ్మద్ మాజీద్‌హుస్సేన్ (ఎంఐఎం) నాంపల్లి శాసనసభ్యుడిగా, రామ్నాస్పుర కార్పొరేటర్ మహ్మద్ ముబీన్ బహదూర్‌పురా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎర్రగడ్డ డివిజన్ నుంచి విజయం సాధించిన ఎంఐఎం కార్పొరేటర్ షాహీన్‌బేగం ఇటీవల చనిపోయారు. గ్రేటర్‌లో 150 డివిజన్లు ఉండగా.. ప్రస్తుతం కౌన్సిల్‌లో 146 మంది కార్పొరేటర్లు మాత్రమే ఉన్నారు. జీహెచ్‌ఎంసీ చట్టం 1955 ప్రకారం.. కార్పొరేటర్ మరణించిన నాలుగు నెలల్లో ఉప ఎన్నికలు నిర్వహించాలి. దేవర కరుణాకర్ మరణించి యేడాదిన్నర కాగా.. మరో ఇద్దరు కార్పొరేటర్లు శాసనసభ్యులుగా ఎన్నికై ఆరు నెలలు దాటింది. అయినా, ఇప్పటి వరకు ఉప ఎన్నికలు నిర్వహించలేదు. ఖాళీ అయిన డివిజన్ల వివరాలు పంపుతూ.. ఉప ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు ఎన్నికల సంఘానికి జీహెచ్‌ఎంసీ లేఖ రాసింది. షాహీన్ బేగం మరణం నేపథ్యంలో గురువారం ఎర్రగడ్డ స్థానం ఖాళీ అయ్యిందని పేర్కొంటూ కమిషనర్ ఆమోదం తీసుకున్నారు. ఎన్నికల విభాగం ద్వారా ఈ ఫైల్‌ను త్వరలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపనున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఉప ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందా..? లేదా? అన్నది చూడాలి.

రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం : స్పీకర్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

హయత్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం హయత్‌నగర్‌లోని వర్డ్ అండ్ డీడ్ ఎడ్యుకేషన్ అకాడమీ ఆవరణలో 47వ సీనియర్ నేషనల్ త్రోబాల్ ఛాంపియన్ షిప్ పోటీలు జరిగాయి. ముఖ్య అతిథిగా తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి క్రీడల పట్ల మక్కువ ఎక్కువ అని అన్నారు. ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాలుగా సహకరిస్తుందన్నారు. త్రోబాల్ ఛాంపియన్ షిప్‌పోటీలకు దేశంలోని 26 రాష్ట్రాల పురుషులు, మహిళా టీంలు వచ్చాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి వేణుగోపాలచారి, తెలంగాణ స్టేట్ త్రోబాల్ అసోసియేషన్ చైర్మన్ ప్రేంసాగర్‌రావు, టీఎస్‌పీఎస్సీ మాజీ సభ్యుడు విఠల్, అమీర్ అలీఖాన్, అధ్యక్షుడు సత్యం శ్రీరంగం, వర్కింగ్ ప్రెసిడెంట్ రవికుమార్, ఉపాధ్యక్షుడు కృష్ణా రాజ్‌పుత్, చిత్ర, జమీల్, కృష్ణారెడ్డి, కాంగ్రెస్ నాయకుడు గజ్జి భాస్కర్‌యాదవ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం

● అందుకే కాంగ్రెస్ ఓటమి : దానం



మాట్లాడుతున్న దానం

బంజారాహిల్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్, బీజేపీ మధ్య లోపాయికారీ ఒప్పందం కుదిరిందని, అందుకే కాంగ్రెస్ ఓటమి పాలైందని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆరోపించారు. బంజారాహిల్స్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ విజయం కోసం డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు తీవ్రంగా శ్రమించారన్నారు. కాంగ్రెస్ పార్టీపైన అభిమానం, తన పట్ల ప్రేమ, ముఖ్యమంత్రి రేవంత్ నాయకత్వంపైన విశ్వాసం కారణంగా పెద్ద ఎత్తున ఓటర్లు కాంగ్రెస్ పార్టీకి మద్దతు పలికారన్నారు. తన ఓటమికి అనేక కారణాలు ఉన్నాయని తెలిపారు. బీఆర్‌ఎస్, బీజేపీ కలిసి పని చేస్తున్నాయని తెలిసే తాను బీఆర్‌ఎస్‌ను వీడినట్లు చెప్పారు. తన ఆరోపణలు వాస్తవం చేస్తూ బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు బీజేపీ కోసం పనిచేశారని ఆరోపించారు. బీజేపీ అక్రమ మార్గాల్లో మద్యం, డబ్బు పంపిణీ చేస్తూ విజయం సాధించిందన్నారు. సికింద్రాబాద్‌లో నైతిక విజయం తనదేనన్నారు. పరిస్థితులు మారుతున్నాయి.. బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఆదరణ తగ్గుతుంది.. అభివృద్ధి ఆకాంక్షించే ప్రజాప్రతినిధులు కాంగ్రెస్‌లోకి రావాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీలోనే అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని తెలిపారు.

జూబ్లీహిల్స్‌లో తొలగించిన ఓట్లపై విచారణ చేయాలి

బంజారాహిల్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఓట్ల తొలగింపులో ఎవరి హస్తం ఉన్నదనే దానిపై విచారణ జరిపించాలని బీజేపీ సెంట్రల్ జోన్ ఉపాధ్యక్షురాలు జూటూరి కీర్తిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సమయంలో నియోజకవర్గానికి చెందిన 16 వేల ఓట్లు తొలగించారని ఆరోపించారు. దీనివల్ల వారంతా ఓటు హక్కు వినియోగించుకోలేకపోయారని, తద్వారా బీజేపీకి మెజారిటీ తగ్గిందని అన్నారు. వెంటనే బాధ్యులపై చర్యలు తీసుకోవడంతోపాటు తొలగించిన ఓట్లను జాబితాలో చేర్చాలని కోరారు.



రోనాల్డ్ రోస్‌కు వినతిపత్రం ఇస్తున్న కీర్తిరెడ్డి

ఘనంగా శాంతి హోమం

బంజారాహిల్స్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరానగర్ పోచమ్మ ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన పూర్తయి 41 రోజులు పూర్తవడంతో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో శాంతి హోమం నిర్వహించారు. కార్పొరేటర్ పి.విజయారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.

కంటోన్మెంట్ కాంగ్రెస్‌కు కంచుకోటగా మారేనా.!



ఉప ఎన్నిక విజయంతో పార్టీ శ్రేణుల్లో జోష్

సికింద్రాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలో ఏకైక ఎస్సీ అసెంబ్లీ సెగ్మెంట్‌గా ఉన్న సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం దక్కేనా?.... తాజా ఉప ఎన్నికలో హస్తం పార్టీ విజయం సాధించడంతో కంటోన్మెంట్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారేనా?, ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా ప్రభుత్వ పెద్దలు, పార్టీ కీలక నేతలు ఇచ్చిన హామీలు అమలు చేసి నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడడం ద్వారా కంటోన్మెంట్‌లో హస్తం పార్టీని తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దాలని పార్టీ శ్రేణులు కోరుకుంటున్నాయి.

కేంద్ర రక్షణ శాఖ ఆధీనంలోని సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకు చెందిన 8వార్డులు, జీహెచ్ఎంసీ పరిధిలోని మోండ మార్కెట్ డివిజన్ (పాక్షికం) ఉంటాయి. రాజకీయంగా చూస్తే 1957లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గం జనరల్ సెగ్మెంట్‌గా ఉంది. అప్పుడు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా వి.వి.గురుమూర్తి విజయం సాధించారు. మరుసటి ఎన్నికల్లో 1962లో కూడా గురుమూర్తి వరుసగా రెండోసారి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. కాగా, 1967లో ఎస్సీ సెగ్మెంట్‌గా మారిన కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ తరపున వి.రామారావు విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన మరణించడంతో 1972లో ఆయన సతీమణి మంకమ్మకు కాంగ్రెస్ పార్టీ అవకాశం కల్పించింది. 1972 ఎన్నికల్లో హస్తం పార్టీ తరపున మంకమ్మ విజయం సాధించారు. 1978లో సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ సెగ్మెంట్‌ను జనతా పార్టీ కైవసం చేసుకుంది. జనతా పార్టీ నుంచి పోటీ చేసిన మశ్చేందర్ విజయం సాధించారు. 1983లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగిన ఎస్.ఏ.కృష్ణ గెలుపొందారు. 1985లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థి సర్వే సత్యనారాయణ విజయం సాధించారు. 1989లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా డి.నర్సింగ్‌రావు గెలిచారు. ఆ తర్వాత వరుసగా 1994, 1999, 2004లో తెలుగుదేశం పార్టీ తరపున జి.సాయన్న హ్యాట్రిక్ విజయం సాధించారు. అయితే, 2009లో సాయన్న విజయ పరంపరకు బ్రేకులు పడ్డాయి. 2009 ఎన్నికల్లో డాక్టర్ పి.శంకర్‌రావు కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. మరుసటి ఎన్నికల్లో... 2014లో తెలుగుదేశం పార్టీ తరపున జి.సాయన్న విజయం సాధించడంతో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మళ్లీ మొదటికే వచ్చింది. 2014 ఎన్నికల్లో గెలిచిన తర్వాత జి.సాయన్న టీడీపీకి గుడ్‌బై చెప్పి, టీఆర్ఎస్(బీఆర్ఎస్) కండువా కప్పుకున్నారు. 2018 ఎన్నికల్లో టీఆర్ఎస్ తరపున పోటీ చేసిన సాయన్న మరోసారి గెలుపొందారు. కాగా, నాలుగేళ్ల అనంతరం అస్వస్థతకు గురై సాయన్న కన్నుమూశారు. దాంతో 2023 ఎన్నికల్లో సాయన్న స్థానంలో ఆయన కుమార్తె లాస్య నందితకు బీఆర్ఎస్ పార్టీ టికెట్ కేటాయించింది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున లాస్య నందిత విజయం సాధించారు. అయితే, మూడు నెలలు కూడా గడవకముందే రోడ్డు ప్రమాదంలో లాస్య నందిత మృతిచెందారు. దాంతో సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తాజాగా లోక్‌సభ ఎన్నికలతోపాటే ఉప ఎన్నిక కూడా జరిగింది. ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ తరపున ఎన్.శ్రీగణేష్ విజయం సాధించారు.

సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధతోనే...

2009లో గెలిచిన కాంగ్రెస్ పార్టీ.... ఆ తర్వాత గెలుపు రుచి చూడలేదు. విజయమంటే ఏమిటో కూడా మరిచిపోయిన స్థితిలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కొట్టుమిట్టాడుతున్నాయి. ఏం చేస్తే.... కంటోన్మెంట్‌లో హస్తం పార్టీ గెలుస్తుందో, ఏం జరిగితే కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందోనని అంతా నిరీక్షిస్తున్న వేళ.... కంటోన్మెంట్‌కు ఉప ఎన్నిక రావడం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరచారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించిన కొందరు నాయకులను పార్టీలోకి తిరిగి వచ్చేలా కృషి చేశారు. ఇతర పార్టీలలోని ముఖ్యంగా బీఆర్ఎస్‌లోని ద్వితీయ శ్రేణి నాయకులను హస్తం గూటికి రప్పించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావును రంగంలోకి దింపి, వారి నేతృత్వంలో హస్తం పార్టీ కేడర్‌లో నూతనోత్సాహాన్ని నింపారు. ఫలితంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ హస్తం పార్టీ సొంతమైంది. ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని హామీలను అమలు చేస్తూ, స్థానికంగా అభివృద్ధికి పాటు పడడం ద్వారా, పార్టీని మరింత పటిష్ఠం చేయడం ద్వారా కంటోన్మెంట్‌ను కాంగ్రెస్ పార్టీ ఖిల్లాగా తీర్చిదిద్దాలని పార్టీ శ్రేణులు కోరుకుంటున్నాయి.



సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి

కంటోన్మెంట్‌లో సమస్యలను పరిష్కరించండి

మారేడుపల్లి జూన్ 6(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డిని గురువారం ఆయన నివాసంలో ఆర్టీసీ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి కలిశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ ప్రాంతంలో మంచి నీటి, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని సీఎం రేవంత్ రెడ్డిని కోరినట్లు సంజీవరెడ్డి తెలిపారు.



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సామల హేమ

తాగునీటి సమస్యను పరిష్కారిస్తాం: హేమ

బౌద్ధనగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్‌లో తాగునీటి సమస్యను పరిష్కారిస్తామని కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. గురువారం జలమండలి అధికారులతో కలిసి ఆమె సీతాఫల్‌మండి రామాలయం తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ ప్రాంతంలో మురుగునీరు ఉప్పొంగుతుందని, మంచి నీరు లోప్రెషర్‌తో వస్తుందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ అన్విత్, ఎస్ఎఫ్ఐ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: దీపిక



సిమెంట్ రేకులు కూలిన గదిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ దీపిక

మారేడుపల్లి జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఓల్డ్ మారేడుపల్లిలో ఇటీవల కురిసిన వర్షాలకు గురువారం ఓ ఇంటికి సంబంధించిన గది సిమెంటు రేకులు కూలాయి. ఆ సమయంలో కుటుంబ సభ్యులు పక్క గదిలో ఉండడంతో ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న మోండా కార్పొరేటర్ కొంతం దీపిక ఘటన స్థలాన్ని సందర్శించారు. బాధితురాలు జయ లక్ష్మమ్మ కుమారితో మాట్లాడిన కార్పొరేటర్ ఆర్థిక సాయం అందజేయడంతో పాటు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి నష్ట పరిహారం అందేలా చూస్తానని భరోసా ఇచ్చారు.



మొక్కను నాటి నీరు పోస్తున్న చిన్నారులు, సీతారాంమాదిగ

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి

బౌద్ధనగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని బీదలబస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నందారం సీతారాంమాదిగ సూచించారు. అంతర్జాతీ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం బీదలబస్తీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని పిల్లలతో కలిసి మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ విజయకుమార్, మహిళలు, పిల్లలు పాల్గొన్నారు.



శ్యాంసుందర్‌గౌడ్‌కు స్వీట్లు తినిపిస్తున్న నాయకులు

సీతాఫల్‌మండిలో బీజేపీ శ్రేణుల సంబురాలు

బౌద్ధనగర్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఎంపీగా జి.కిషన్‌రెడ్డి రెండోసారి గెలవటంతో బీజేపీ సికింద్రాబాద్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, మహిళలు గురువారం సీతాఫల్‌మండిలో బాణాసంచాను కాల్చి, స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ కేకు కట్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, ఉపాధ్యక్షుడు రాచమల్ల కృష్ణమూర్తి, కన్వీనర్ కందాడి నాగేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.రవిప్రసాద్‌గౌడ్, కనకట్ల హరి, ప్రభుగుప్తా, డివిజన్ అధ్యక్షుడు అంబాల రాజేశ్వరరావు, అజయ్‌నాయుడు, సాయిదత్తు, శారదా మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ అడ్డాలో కనీస సదుపాయాలు కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న కార్మికులు

అడ్డగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తుకారాంగేట్ చౌరస్తాలోని లేబర్ అడ్డా వద్ద మూత్రశాలలు వంటి కనీస సదుపాయాలు కల్పించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సికింద్రాబాద్ అధ్యక్షుడు గౌరి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం తుకారాంగేట్‌లో భవన నిర్మాణ కార్మికుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తుకారాంగేట్ చౌరస్తాలోని లేబర్ అడ్డాలో కూలి పని కోసమని ఉదయం నుంచి వందలాదిమంది గంటల తరబడి వేచి ఉంటారని అన్నారు. ఈ సమయంలో కనీసం కాలకృత్యాలు తీర్చుకునేందుకు కనీస సదుపాయం లేక, తాగేందుకు నీరు లేక ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు రవి, రమేష్, మల్లేష్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అమావాస్యను పురస్కరించుకని గురువారం వారాసిగూడ చౌరస్తాలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు కూరాకుల సుధాకర్, కార్యదర్శి రాజేష్, కోశాధికారి వీరశేఖర్, మాజీ అధ్యక్షులు బెలిదే నర్సింహారావు, కోట శ్రీనివాసరావు, బెలిదేరాజు తదితరులు పాల్గొన్నారు.

\- బౌద్ధనగర్ (ఆంధ్రజ్యోతి)

మానవత్వం మన మతం... అన్నదానం మన వ్రతం



కంసారిబజార్ ముత్యాలమ్మ ఆలయంలో ఎమ్మెల్యే శ్రీగణేష్, ముప్పిడి మధుకర్ తదితరులు

బోయినపల్లి, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): మానవత్వం మన మతం... అన్నదానం మన వ్రతం అని.. అందుకే అన్నదానం చేయడంవల్ల ఎన్నో ఫలితాలు మనకు కలుగుతాయని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. గురువారం అమావాస్యను పురస్కరించుకుని కంటోన్మెంట్‌లోని కంసారిబజార్‌లో గల ముత్యాలమ్మ ఆలయంలో కాంగ్రెస్ నాయకుడు కంటోన్మెంట్ కేబుల్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ముప్పిడి మధుకర్ ఆధ్వర్యంలో అమావాస్య పూజలు అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే శ్రీగణేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమాన్ని ముప్పిడి మధుకర్‌తో కలిసి శ్రీగణేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో మిట్టు, శేఖర్, భాస్కర్, రాజు, కుమార్, కిశోర్, హరినారాయణ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శ్రీగణేష్‌కు అభినందనల వెల్లువ

మారేడుపల్లి జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉప ఎన్నికల్లో కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా శ్రీగణేశ్ విజయం సాధించడంతో కంటోన్మెంట్‌కు చెందిన వివిధ సంఘాల ప్రతినిధులు, మహిళా గ్రూపులు, అభిమానులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు గురువారం పికెట్‌లోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయానికి వచ్చి ఆయనను అభినందించారు. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు.



నల్లపోచమ్మ ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమంలో జంపన ప్రతాప్

అమ్మవారి ఆలయాల్లో అమావాస్య అన్నదానం

బోయినపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అమావాస్యను పురస్కరించుకుని బోయినపల్లిలోని బాపూజీనగర్ శ్రీదేవి నల్లపోచమ్మ ఆలయం, జయనగర్ చౌరస్తాలోని నల్లపోచమ్మ ఆలయం, చిన్నతోకట్టలోని కట్టమైసమ్మ ఆలయాల్లో ఆలయ సభ్యులు పలువురు దాతల సహకారంతో పెద్ద ఎత్తున గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ నేపథ్యంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకులు జంపన ప్రతాప్ ముఖ్యఅతిథిగా పాల్గొని పలు ఆలయాల్లో కొలువై ఉన్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయాలలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలను జంపన్న ప్రతాప్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాన్ని కొనసాగించేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బాపూజీనగర్ నల్లపోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు దుర్గయ్య, అజిత్ కళ్యాణ్, రామారావు, శ్రీకాంత్, పుట్టి నరసింహ, జహంగీర్‌గౌడ్, నరేందర్, రాధిక, జయనగర్ నల్లపోచమ్మ, ఆలయ కమిటీ సభ్యులు రాముగౌడ్, అనిల్, శశిధర్‌గౌడ్, కట్టమైసమ్మ ఆలయ కమిటీ సభ్యులు జాజుల విఠల్‌రావు, క్రాంతి, సాయి, వరప్రసాద్, ముఖేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానాన్ని అడ్డుకోవడం సరికాదు

- కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్‌కుమార్

తిరుమలగిరి జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మహంకాళి దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదని కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు శ్యామ్‌కుమార్ అన్నారు. గురువారం ఉదయం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత రెండు సంవత్సరాలుగా లాల్‌బజార్ మహంకాళి ఆలయంలో అమావాస్య రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. కొందరు వ్యక్తులు తమ స్వార్థ ప్రయోజనల కోసం ఆలయంలో అన్నదానం చేయవద్దని దేవాదాయ శాఖకు ఫిర్యాదు చేయడంతో గురువారం జరగాల్సిన అన్నదాన కార్యక్రమాన్ని తమ కార్యాలయం ఆవరణలో నిర్వహించామని తెలిపారు. దేవాలయ శాఖ దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి పరిష్కరించుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో బోర్డు మాజీ సభ్యురాలు ప్యారసాని భాగ్యశ్రీ, వార్డ్-7 బీఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు యశ్వంత్ కుమార్, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లాల్‌బజార్‌లో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో భాగ్యశ్రీ

వంకర కాళ్లతో పుట్టిన పిల్లలకు ఆధునిక చికిత్స

- పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్



పిల్లలకు బహుమతులను అందజేస్తున్న ఎండీ డాక్టర్ గురువారెడ్డి

హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వంకర కాళ్లతో పుట్టిన పిల్లలకు ఆధునిక వైద్య చికిత్సలు, సాంకేతికతో సరిచేసి వారు సాధారణ జీవనం గడిపేటట్టు చేయవచ్చునని పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ వివరించారు. వరల్డ్ క్లబ్‌ఫుట్‌డే సందర్భంగా బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన చిన్నారులకు చీఫ్ రోబోటిక్ జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్, సన్‌షైన్ బోన్ అండ్ జాయింట్ ఇనిస్టిట్యూట్ చైర్మన్, కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రి ఎండీ డాక్టర్ ఏవీ గురవారెడ్డి చిన్నారులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా క్లబ్ ఫుట్ సమస్యతో బాధపడుతున్న చిన్నారులకు డాక్టర్ విద్యాసాగర్ పరీక్షలు చేసి చికిత్స అందజేశారు. వంకర కాళ్లతో సరిగ్గా నడవలేకపోవడం, కూర్చోలేక ఇబ్బంది పడుతుంటారని, దీనిని వైద్య పరిభాషలో క్లబ్‌ఫుట్ సమస్యగా పరిగణిస్తారని డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. ఇది కొంతమంది పిల్లల్లో వంశపారపర్యంగా వచ్చే అవకాశం ఉందన్నారు. ఇలాంటి వారికి ఆధునిక శాస్త్ర చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, తద్వారా సమస్యను పరిష్కరించేందుకు అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న చికిత్సలతోపాటు సాంకేతికతతో సరిచేయడం వల్ల పిల్లలు సాధారణ జీవితం గడపడమే కాకుండా, క్రీడల్లోనూ పాల్గొనవచ్చు అన్నారు. క్లబ్‌ఫుట్ సమస్యకు చికిత్స తీసుకుంటున్న చిన్నారులతోపాటు వారి తల్లిదండ్రులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భవనంపై నుంచి దూకి వ్యక్తి మృతి

అడ్డగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు చేసిన దాడి నుంచి తప్పించుకునేందుకు భవనం పైనుంచి దూకిన ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. ఈ ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. లాలాపేట్‌లోని శాంతినగర్‌కు చెందిన వినయ్‌కుమార్(35) ప్రైవేట్ ఉద్యోగి. గురువారం రాత్రి లాలాపేట లక్ష్మీనగర్ ప్రాంతంలోని ఓ భవనంపై కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారు. వినయ్‌కుమార్ కూడా అక్కడికి వెళ్లాడు. పేకాట ఆడుతున్న సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు అక్కడికి వెళ్లారు. పోలీసులు వస్తున్న విషయాన్ని గమనించిన పేకాటరాయుళ్లు అక్కడి నుంచి తప్పించుకున్నారు. వినయ్‌కుమార్ కూడా తప్పించుకునే ప్రయత్నంలో పేకాట ఆడుతున్న భవనం మూడో అంతస్తు పైనుంచి కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని అంబులెన్స్‌లో సికింద్రాబాద్‌లోని యశోదా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఉప ఎన్నికలు ఎప్పుడో..?

- గ్రేటర్‌లో నాలుగు డివిజన్లు ఖాళీ
- ఇద్దరు కార్పొరేటర్ల అకాల మరణం
- ఎమ్మెల్యేలుగా ఎన్నికైన మరో ఇద్దరు



హైదరాబాద్ సిటీ, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో నాలుగు డివిజన్లు ఖాళీ అయ్యాయి. రెండు స్థానాల్లో కార్పొరేటర్లు మరణించగా.. ఓ కార్పొరేటర్ ఎమ్మెల్సీగా, మరో కార్పొరేటర్ ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీంతో ఆయా స్థానాలకు ఉప ఎన్నికలు జరగాల్సి ఉంది. గుడిమల్కాపూర్ నుంచి బీజేపీ తరపున కార్పొరేటర్‌గా ఎన్నికైన దేవర కరుణాకర్ 2023, జనవరిలో అనారోగ్యంతో మరణించారు. ఆరు నెలల క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మెహిదీపట్నం కార్పొరేటర్ మహ్మద్ మాజీద్‌హుస్సేన్ (ఎంఐఎం) నాంపల్లి శాసనసభ్యుడిగా, రామ్నాస్‌పుర కార్పొరేటర్ మహ్మద్ ముబీన్ బహదూర్‌పురా ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఎర్రగడ్డ డివిజన్ నుంచి విజయం సాధించిన ఎంఐఎం కార్పొరేటర్ షాహీన్ బేగం ఇటీవల చనిపోయారు. గ్రేటర్‌లో 150 డివిజన్లు ఉండగా.. వివిధ కారణాలతో నాలుగు డివిజన్లు ఖాళీ అయ్యాయి. ప్రస్తుతం కౌన్సిల్‌లో 146 మంది కార్పొరేటర్లు మాత్రమే ఉన్నారు. జీహెచ్ఎంసీ చట్టం 1955 ప్రకారం.. కార్పొరేటర్ మరణించిన నాలుగు నెలల్లో ఉప ఎన్నికలు నిర్వహించాలి. దేవర కరుణాకర్ మరణించి యేడాదిన్నర కాగా.. మరో ఇద్దరు కార్పొరేటర్లు శాసనసభ్యులుగా ఎన్నికై ఆరు నెలలు దాటింది. అయినా ఇప్పటి వరకు ఉప ఎన్నికలు నిర్వహించలేదు. ఖాళీ అయిన డివిజన్ల వివరాలు పంపుతూ.. ఉప ఎన్నికల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని గతంలో పలుమార్లు ఎన్నికల సంఘానికి జీహెచ్ఎంసీ లేఖ రాసింది. షాహీన్ బేగం మరణం నేపథ్యంలో గురువారం ఎర్రగడ్డ స్థానం ఖాళీ అయ్యిందని పేర్కొంటూ కమిషనర్ ఆమోదం తీసుకున్నారు. ఎన్నికల విభాగం ద్వారా ఈ ఫైల్‌ను త్వరలో రాష్ట్ర ఎన్నికల సంఘానికి పంపనున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఉప ఎన్నికల నిర్వహణకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకుంటుందా..? అన్నది చూడాలి.



అభివాదం చేస్తున్న ఎంపీ ఆర్.కృష్ణయ్య, ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్, రాజారాం యాదవ్, వివిధ సంఘాల నాయకులు

బీసీ రిజర్వేషన్లు, హక్కుల సాధనకు మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం

- 15న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా

పంజాగుట్ట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల పెంపు, వాటి హక్కుల సాధన కోసం మిలిటెంట్ పోరాటాలకు సిద్ధం కావాలంటూ పలువురు వక్తలు పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం అధ్యక్షతన గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'కామారెడ్డి డిక్లరేషన్-సమగ్ర కులగణన' అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్ కుమార్, గిరిజన రిజర్వేషన్ సాధన సమితి చైర్మన్ సంజీవ్ నాయక్, వివిధ బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్ల హక్కుల సాధన కోసం ఈనెల 15న ఇందిరాపార్కు వద్ద మహాధర్నాకు పిలుపునిచ్చారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీల అమలు కోసం బీసీ సంఘాలు ఐక్యం కావాల్సిన అవసరం ఉందని ఆర్.కృష్ణయ్య అన్నారు. అధికార కాంగ్రెస్ పార్టీకి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా.. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆర్డినెన్స్ తేవాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. బీసీలను మరోసారి మోసగించేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైందని, రిజర్వేషన్ల సాధన కోసం ఎలాంటి కార్యాచరణ తీసుకున్నా.. తాను ఎప్పుడూ ముందుంటానని అన్నారు. సమావేశంలో రాజారాం యాదవ్ వివిధ బీసీ సంఘాల నాయకులు కాటం నర్సింహ యాదవ్, పోచబోయిన శ్రీహరి యాదవ్, సాయిని నరేందర్, బత్తుల సిద్ధేశ్వర్, రమేష్ యాదవ్, ఎలక్ట్రానిక్ మీడియా తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం అధ్యక్షుడు రమణ కుమార్, టి.జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల క్రిష్ణ, ఆలకుంట హరి, నీల వెంకటేష్, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

సిగ్నల్ వద్ద ర్యాష్ డ్రైవ్.. పల్టీలు కొట్టిన కారు



పల్టీలు కొట్టి రోడ్డుపై పడిన కారు

మారేడుపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లోని సికింద్రాబాద్ క్లబ్ చౌరస్తా వద్ద ర్యాష్ డ్రైవింగ్ వల్ల కారు అదుపుతప్పి మూడు పల్టీలు కొట్టింది. కారులో ఉన్న వారు ప్రాణాలతో భయటపడ్డారు. మారేడుపల్లి ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... ఈసీఐఎల్ ప్రాంతానికి చెందిన ఎం.నరేష్ బుధవారం మధ్యహ్నం తన కారును నడుపుతూ కార్ఖానా నుంచి సికింద్రాబాద్ వైపు వస్తున్నాడు. కంటోన్మెంట్‌లోని సికింద్రాబాద్ క్లబ్ వద్దకు రాగానే సిగ్నల్ పడుతుందన్న తొందరలో కారును స్పీడ్‌గా నడిపించాడు. ఈ క్రమంలో సికింద్రాబాద్ క్లబ్‌లో నుంచి వస్తున్న మరో కారును ఢీ కొట్టాడు. దీంతో తన కారు పల్టీలు కొట్టి డివైడర్ మీదుగా పక్కకు పడిపోయింది. కారు నడుపుతున్న నరేష్ తలకు స్వల్ప గాయమైంది. మరో కారులో ఉన్నవారు క్షేమంగా బయటపడ్డారు. ఈ ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. నరేష్ నిర్లక్ష్యంగా డ్రైవ్ చేస్తూ తన కారును ఢీకొట్టాడని మరో కారు యజమాని సుశీల్ గురువారం మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. 279 ఐపీసీ, 184 ఎంవీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 27కిలోల గంజాయి పట్టివేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 27కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావెద్, కాచిగూడ జీఆర్పీ సీఐ ఎల్లప్ప తెలిపారు. గురువారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. రైల్వే ఎస్పీ సలీమా ఆదేశాల మేరకు గురువారం జీఆర్పీ పోలీసులు ప్లాట్‌ఫాం నంబరు-1లో తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి వద్ద ఉన్న బ్యాగులో 17 ప్యాకెట్లలో ఉన్న 27 కిలోల గంజాయి పట్టుబడింది. పట్టుబడిన గంజాయి విలువ రూ.6.75 లక్షలు ఉంటుందని ఆయన తెలిపారు. ఈ మేరకు జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి ఆరా తీస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ బాధితుడికి అందజేత

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఉప్పల్‌కు చెందిన సుధాకర్ నాంపల్లి రైల్వేస్టేషన్‌లో రైలు దిగుతుండగా జేబులో చూసుకోగా తన సెల్‌ఫోన్ (రూ.12 వేల విలువైన) కనిపించలేదు. వెంటనే బాధితుడు రైల్వేస్టేషన్‌లోని ఆర్పీఎఫ్ కానిస్టేబుల్ జయవీర్‌కు ఫిర్యాదు చేశాడు. వారు వెంటనే స్పందించి రైల్వే స్టేషన్‌లో వెతకగా ప్లాట్‌ఫాం నం-1లో సెల్‌ఫోన్ దొరికింది. బాధితుడి వివరాలు నమోదు చేసుకున్న ఆర్పీఎఫ్ పోలీసులు సెల్‌ఫోన్‌ను అతడికి అందజేశారు.



మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఘన విజయం సాధించిన ఈటల రాజేందర్‌ను గురువారం సికింద్రాబాద్ కంటోన్మెంట్ పాలక మండలి మాజీ ఉపాధ్యక్షుడు సాద కేశవరెడ్డి, సామల సత్తిరెడ్డి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

\- సికింద్రాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి)